# సమస్య....?

రచన :
మునిపల్లెరాజు

కార్తీకమాసపు సాయంత్రం! సన్నని జల్లులు!! అరుగుమీద కూర్చొని దాదా శూన్యంవంక చూస్తున్నాడు.

దగ్గరకువెళ్ళి "దాదా!" అన్నా.

దాదా కళ్ళనిండా నీళ్ళు.

'దాదా! ఏడుస్తున్నావా?

'ఉద్యోగం పోయింది— బ్రాంచి పోష్టుమాష్టరు వుద్యోగం.' పాతికేళ్ళక్రిందట మావూరి పోష్టుఆఫీసుకోసం చెమటోడ్చినవాడు దాదాకు కావలసిన ఆంగ్లవిజ్ఞానం లేదని యిప్పుడా వుద్యోగం తీసేశారని తరవాత తెలిసింది.

దాదా వుపవాసాల సంగతి, అతని క్షుద్బాధ జీవితం యెవరికీ తెలియని విషయాలు. ఆ వుద్యోగం పోయింతరవాతగూడ దాదా హాసచిహ్నాలు యింకా వెన్నెలజల్లుల్ని కురిపిస్తూనే వున్నాయి. అంతే మాపల్లెకు కావలసింది!!

దాదా వుపాధ్యాయవృత్తికి జీతమూ, భత్యాలూ లేవు. ఎవరన్నా దయతలిచి కుంచెడు ధాన్యం యిస్తారేమో యేటేటా. దొడ్లో దోస పిందెలూ, ఆ ఆకువిడుపు కాన్కలూ; యీ ధాన్యమూ—యివీ అతని కుటుంబానికి జీవనాధారం- సంవత్సరానికల్లా. వాటికితోడు యింటి ముంగిటవున్న తోటకూరకాడలేమైనా రుచిస్తుంటాయేమో!

దాదాకు వుంటే—ఒక్కటే వున్నదేమో గర్వకారణం, తన బాల్యవిద్యార్థుల్ని గూర్చి. అతని విద్యార్థుల్లో ఒకళ్ళు హైకోర్టు జడ్జీగా వున్నాడు యీ రోజుకూడా. ఒకడు రాజాగారి దివాను.

దాదా బోసినోటినుండి ఒలికే కథలంటే చెవికోసుకోని పిల్లలులేరు. దాదా బడికి తాను సెలవిచ్చినా, పిల్లలుమాత్రం అతనికది దక్కనీరు. దాదాకు వృద్ధాప్యంలో పుట్టిన శ్రీహరికూడా యిప్పుడు పదేళ్ల చిన్నవాడైనాడు. శ్రీహరి తోటి పిల్లలతో 'కోతికొమ్మచ్చి'లాటలాడుతూంటే చూసి తన్ను తాను మరచిపోయేవాడు వెర్రిదాదా! ఆ దాదా — యీనాటి కంటితడికి శిరసొగ్గవలసి వచ్చింది!!

రోజురోజుకూ క్రుంగిపోతూన్న దాదా దుర్భరత్వం అప్పారావు బాగా యెరిగిన విషయం. అప్పారావు పెద్దాసామి. మొన్న మొన్నటిదాకా జమీందారు పార్టీలోవుండి గవర్నమెంటు లోకలు బోర్డు యెలెక్షనుకు పడరానిపాట్లుపడి, ధననష్టమూ అవమానమూ స్వీకరించి... నిన్న నేడు ఖద్దరుటోపీకి జారబడ్డవాడు. ఆ వెనకటి నీచస్థితినంతా ప్రజలు మరచేందుకు యిప్పుడతని కొత్తయెత్తులు!

అప్పారావు స్వార్థపరత్వాన్నుండే రూపొందింది. 'పల్లె'లో ఒక చిన్న కమిటీ స్కూలు. భవిష్యత్తు తాబేదార్ల మొదటి యీ చిన్న ఫ్యాక్టరీలో నలపబడేందుకు యిక్కడ ప్రథమ సోపానాలు!

దాదా 'అప్పారావు' కు కూడా ఓనాడు అయ్యవారే!—ఈనాడు అప్పారావు ఆ స్కూలు ప్రెసిడెంటు. అతని భవిష్యత్తుకు పునాదులు వేసిన దాదా, అతనిక్రిందనే ఒక తొత్తు.

ఆరోనెల్లో దాదాకు నోటీసు జారిచేశాడు అప్పారావు. 'మీరిక వెళ్ళిపోవాలి. ట్రైనింగుకాని పల్లెటూరి మేష్టర్లకు, గవర్నమెంటు గ్రాంటు యివ్వదు.'

దాదా అమాయకంగా ప్రశ్నించాడు—

'నేనెక్కడికి పోను—?'

'ఏట్లోకి' చాలా నిరసనతో అన్నమాటలవి. అప్పారావు! ఒకనాటి తన విద్యార్థి!!

ప్రజలందరూ తన్ను మరిచారా? అనుకొన్నాడు దాదా. బహుశః తన్ను మరిచే వుండవచ్చు ననుకొన్నాడు. ప్రజలూ యావన్మందీ తన్ను మరిచినా, ఆకలిమాత్రం తనను మరిచేందుకు ఒప్పటంలేదు!

ఇక వున్నది ఒకటే సాధనం, ముక్తి! వైద్యవృత్తి!! తనవంటి ముసలివాడా, యీ డాక్టరుతో, అతని ఇంగ్లీషు సూట్లతో, కళ్లజోళ్ళతో పోటీలు చేసేది! ఎవరూ ఆదరిస్తున్నట్లు అవుపించలేదు. దాదా అప్పుడు తెలుసుకొన్నాడు— 'తన కషాయాలు మహాత్యం అంతరించిందని.'

చలికాలం! ఎముకల్ని కొరికి రుచి చూస్తోంది. ఇంట్లో పీలికలుతప్ప ఒక్క మంచి గుడ్డలేదు! గుప్పెడు ధాన్యం ఒక వింతవస్తువో, విదేశవస్తువో అయిపోయింది.

తన బడి పోయినప్పట్నించీ శ్రీహరి చాలా విసలుపడ్డాడు. కాదామరి, తిరిగే కాలాయెను! శ్రీహరి అన్నమాటలు దాదాహృదయంలోని గాయాలనురేపేవి. "నాన్నా! వాళ్ళ కిష్టును ఆడుకోనేందుకు రమ్మంటే కసిరేస్తున్నాడు నాన్నా. నువ్వు చెప్పవూ?" ఆకిష్టుడు యిప్పుడు ఇంగ్లీషువిద్యార్థి! ఈ జుట్టుముడి బీదపిల్లవాడంటే అసహ్యించమని చెప్పేవిద్యను అర్థిస్తూన్న అభ్యర్థియిప్పుడు!!

దాదా చాలా అలిసిపోయాడు యీ ప్రపంచంతో. తనదగ్గరకు మంచిరోజు చూడమని వచ్చేవాళ్ళతో అప్పుడప్పుడు మాట్లాడుతాడు! అంతే— అత్యంతమౌనం!!

శ్రీహరికి ఆ శీతాకాలంలోనే "మలేరియా" వచ్చింది. మందులుకొనేందుకు డబ్బులేని తండ్రితో విసిగి చచ్చిపోయాడు. దాదాకళ్లు చాలా లోతుకుపోయినై కాని యేడవలేదు! అయితే, ఆకలిమాత్రం అతణ్ణి యేడిపిస్తూనేవుంది యింకా!

మళ్ళీ, ఆ విశ్వాసఘాతకుడు అప్పారావు దగ్గరకే వెళ్లి అర్థించాడు. మొదట ఒకవారంరోజులు దర్శనమే కాలేదు. తరవాత గుమ్మంలోంచి తోలగిపొమ్మన్నాడు.

ఆకలి వేధిస్తూనేవుంది. ఈమాటు దాదా ఒక నిశ్చయానికివచ్చాడు. మళ్లీ తన మామూలు బడి సాగించాలి. అప్పారావుకు బుద్ధిగరపాలి. తన పాత స్నేహితుల్నీ, కొత్తకుర్రవాళ్ళనీ అందర్నీ ప్రార్థించాడు తమపిల్లవాళ్ళను పంపమని తన కొత్తబళ్లోకి! నేనుతప్ప యింకెవ్వరూ పంపలేదు. ఈ ముసలిబడి యెవరిక్కావాలి? అదుగో, అక్కడ మంగుళూరు పెంకుల తెల్లబంగళా!

ఈ సంగతంతా నాతో చెప్పాడు దాదా!

"ఎందుకంటావు దాదా, యీమార్పంతా? అన్నా"

"మార్పుకాదోయ్—మార్పేమిటి, మార్పులేదు గీర్పులేదూ."

దాదా వుద్దేశ్యంలో తన శ్రీహరిచావే దీనికంతకూ కారణమని. శ్రీహరిలేడు. ఆడుకోనేపిల్లలకు సహవాసమూలేదు—వాడి పోకతో.

అయినా, యిదొక సందిగ్ధసమస్యగానే వుండేది దాదాకు.

---

## చిత్రాంగి జన్మదిన సంచిక

'చిత్రాంగి' ప్రతీ డిసెంబర్‌లోనూ జన్మదినోత్సవం చేసుకుంటుంది. ఆ వుత్సాహాన్ని తానే కాకుండా ఆంధ్ర సోదరసోదరీమణులకి ప్రత్యేకతతో అందిస్తుంది. పేరుకి తగ్గట్టే ప్రతీయేటా చిత్రవిచిత్ర స్వరూపంతో 'చిత్రాంగి' తయారవుతుంది. చిత్రాంగి ప్రత్యేక స్వరూపం చూడటం ఆంధ్రమిత్రులకొక సరదా. ఈ యేడాది 'బేతాళ పంచదశి'. 'ఆ' జ్ఞాపకాలూ, 'శిక్ష', 'రత్తయ్య సంసారం'-చిత్రాంగి యిచ్చిన కళాఖండాలు; ప్రత్యేక సంచికలన్నిటికన్న మేలుబంతి చిత్రాంగి డిశెంబర్ సంచిక.